గల్పిక:

# పొరపాటు

శ్రీ విశ్వమిత్ర

కిటికీ రెక్కని గోడకేసి కాలుతో టక, టకమని శర్మ చేసే చప్పుడు అకస్మాత్తుగా ఆగిపోటంతో, నే నా నిశ్శబ్దానికి కారణమేమిటై వుంటుందా ? అని వాడివేపు తిరిగాను.

వాడు నావైపు తిరిగేటప్పటికే నేను వాడివైపు తిరిగి "ఏమిట" న్నట్టు మొఖం పెట్టటం వాడికి కొంత సంతోషాన్ని కల్పించింది.

నే నడక్కుండానే వాడేదో చెప్పదలుచుకొన్నాడని నాకు తెలిసినా, "ఏం ఆపావ్ ?" అని నే నడక్కుండా వుండలేక పోయాను.

"ఐతే ఇంతకీ మన 'కె. ఎస్. ఆర్.' ఇంట్లో తిరిగే కుర్రా డెవ రంటావ్ ?"

అనుమానం తెగక అడిగాను.

"బావమరిది !"

ఈ విషయం వాడి కెంత తెలుసో నాకూ అంతే తెలుసు! ఎందుకంటే మేమిద్దరం ఒకచోట వుండగానే 'సూరి' మాతో ఫలాని కుర్రాడు లెక్చరర్ కె. ఎస్. ఆర్. 'బావమరిది' అని చెప్పటం జరిగింది.

'ఏనా మళ్ళీ శర్మ అడిగాడూ అంటే బహుశా అది వాడు వినకుండాఅన్నా వుండి వుండాలి,' లేకపోతే విని మరిచిపోయి అన్నా వుండాలి.

అందుకనే ఎందుకైనా మంచిదని నేనదే చెప్పా.

'నిజమే నంటావా ?' అన్నట్టు నావంక ఓ అరనిముషం చూశాడు శర్మ.

'ఏమిటి సందేహిస్తున్నావు ?' అడిగాను.

'ఐతే మన పంట పండిందన్నమాటే !' అన్నాడు చేతిలోవున్న ఫిజిక్స్ పుస్తకాన్ని నిర్లక్ష్యంగా విసిరి పారేస్తూ— ఇహ దానవసరం లేనట్టు...

'అదెలాగు ?' అర్థంకాక అడిగాను.

'డబ్బు !!' అన్నాడు మావాడు.

'పుచ్చుకొంటా డంటావా ?' వెధవ అనుమానం తీరక అడిగాను.

"డబ్బుకి మిగతా వస్తువులన్నీ, రూపాంతరాలే అని నీ కింకా తెలీదనుకొంటాను!' శర్మ సిద్ధాంతము.

డబ్బుని డబ్బురూపంలో కాకుండా ఇంకోరూపంలో అంటే ఏరూపంలో ఐవుంటుందో నాచిన్న బుర్రకి తట్టకపోవటంవల్ల మళ్ళీ దానిక్కూడా వాణ్నే అడగాల్సొచ్చింది.

క్రమంగా వాడు చెప్పిందంతా అర్థంచేసుకొన్నాక — నిజంగా నేను శర్మలో ఓ గొప్ప విషయాన్ని కనిపెట్టగలిగాను. అదేమిటంటే—సామాన్యంగా ఎవరికైనా ఏదైనా ఓసమస్య తెగాలీ అంటే ప్రత్యేకం పనికట్టుకుక్కూర్చుని తల బద్దలు కొట్టుకొంటారు గాని వీ డలాక్కాదు.

శర్మ ఏదైనా గట్టిపన్లో వున్నప్పుడే ఎన్నెన్నో గొప్ప, గొప్పచిక్కుసమస్యలు విడిపోవటం వాడికి మామూలే!

* * *

ఒకనాడు రోడ్డుమీద పోతూంటే మాకు కొన్ని గజాలముందర కొంతమంది వ్యక్తులు మాట్లాడుకొంటూ పోతున్నారు. వాళ్లలో మే మనుకొంటున్న 'కె. ఎస్. ఆర్.' బావమర్దికూడా వున్నాడని చెప్పటం ముఖ్య విషయం.

అప్రయత్నంగా శర్మ చప్పట్లు కొట్టాడు. ఆ జనం ఆగారు.

శర్మా, నేనూ, బాగా దగ్గిరికెళ్లాం. శర్మ అతని (కె. ఎస్. ఆర్. బావమరిది?) వైపు ఓసారి సూటిగా చూసి, "సారీ ! మిమ్మల్ని చూసి మా సుందర మేమో అనుకొన్నా !" అన్నాడు.

తర్వాత శర్మా, నేనూ వాళ్లతో కలిసి పార్కు కెళ్లాం.

అతన్తో పరిచయంచేసుకోటం శర్మకి ఎక్కువ టైం వేస్టుచేసుకోకుండానే జరిగింది.

మరీ సూటిగా అడిగినట్టుకాకుండా శర్మ సంభాషణ మధ్యలో అతన్తో అన్నాడు!

'అన్నట్టు మీరు కె. ఎస్. ఆర్. గారి...

శర్మ ఇంకా పూర్తిగా మాట్లాడకుండానే అతను ఓ చిరునవ్వు నవ్వి:

"ఆఁ- ఆఁ- ఔనౌను..." అన్నాడు.

అనుమానంతీరిపోయినట్టూ—సగం గెలిచినట్టూ మెల్లిగా నవ్వాడు శర్మ.

రొట్టె నేతిలో పడిందని నేనూ సంతోషించకపోలేదు.

* * * *

సెలక్షన్స్ ఐపోయినయ్. అతన్తో మా శర్మా, నేనూ, చనువుగానే తిరుగుతున్నాం. అతని మెప్పుకోసమని శర్మ హోటలుబిల్లులు, సినిమాఖర్చులు, ఇత్యాది అనేక చిల్లర ఖర్చులు భరిస్తూవుండేవాడు. అందుకనే అతను శర్మమాట తోసెయ్యలేడని మా నమ్మకం !

పరీక్షలైపోయింతర్వాత ఓ రోజున అతనితో శర్మ చూచాయగా ఇలాఅన్నాడు!

"మీ బావచేత మా పని చేయించాలి !"

అతను తల పంకించి అర్థంకానట్టు

"మా బావచేత మీపని చేయించటానికి, నా కేం అభ్యంతరం లేదుకానీ - మా బావ వలన మీకు కాగల పనేమిటో నాకర్థం కావటం లేదు..."

శర్మ తెల్లబొయ్యాడు. అన్నీ తెలిసికూడా అతను ఎందుకు ఇలా నటిస్తున్నాడో అర్థంకాక బాధపడ్డాడు. అందుకని ఈ విషయం అతని నోటిమీదుగానే రానిద్దామని శర్మ:

'ఐతే మీ బావ వుద్యోగమేమిటి' అన్నా డదోవిధంగా.

'కంట్రాక్టర్ !'

శర్మకి వొళ్లుమండింది. ఐతే ఇన్నాళ్లనుంచీ అతను - అతను అని చెప్పకొని తనని మోసం చేస్తున్నా డన్నమాట !

'మరి ఆనా డలా చెప్పారేం ?'

'ఎలా చెప్పాను ?'

'కె. ఎస్. ఆర్ గారి బావమరిదనీ !'

'నే నెప్పుడూ అట్లా చెప్పివుండలేదు!'

'చెప్పి - చెప్పలేదంటా వేం?'

'బహుశామీరలా ఊహించివుండొచ్చు'

మాట మీద మాటపెరిగి శర్మకి కోపం ఆగక, ఉద్రేకంమీద తను చేసిన డబ్బంతా పూర్తిగా క్షౌరంఐందని తెలిసేటప్పటికి వొళ్లుమండి అతన్ని దులిపేశాడు.

అతనూ తక్కువ తిన్నవా డేం కాకపోటంచేత అనగలిగినన్ని అతనూ అని ఆఖరికి వెళ్లేటప్పుడు:

"డియర్ శర్మగారూ ! కె. ఎస్. ఆర్. గారు మా అన్నయ్యౌనని మీకు తెలియక పోయినందుకు విచారిస్తున్నాను!" అన్నాడు. ★